1న పర్యావరణంపై పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన మన భూమి, మన భవిష్యత్, మనతరం, పునరుద్ధరణ అనే అంశంపై జూన్ ఒకటో తేదీన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి ఇఇ ఎరామారావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని పిఎన్ కాలనీలో గల న్యూసెంట్రల్ స్కూల్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 6 నుంచి పదో తరగతి లోపు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. విజేతలకు వచ్చే నెల ఐదో తేదీన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

- ఫలితాల పైనే సర్వత్రా చర్చ
- కౌంటింగ్ ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం
- ఆమదాలవలస నుంచే తొలి ఫలితం
- చివరిలో తేలనున్న పాతపట్నం రిజల్ట్



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు (ఫైల్)

అందరి చూపూ ఆ తేదీ వైపే...

ఓట్ల లెక్కింపునకు మరో వారం రోజుల సమయమే ఉంది. జూన్ నాలుగో తేదీ సమీపిస్తుండంతో అందరిలోనూ ఉత్కంఠ మొదలైంది. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై అధికారులు, ఫలితాలపై అభ్యర్థుల్లో టెన్షన్ ప్రారంభమైంది. కౌంటింగ్‌లో పొరపాట్లకు తావీయకుండా ప్రతి చిన్న అంశాన్నీ సునిశితంగా పరిశీలించి అన్నిరకాల జాగ్రత్తలు అధికారులు తీసుకుంటున్నారు. ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపరిచిన ఇవిఎంలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్‌పి జి.ఆర్ రాధిక తరచూ పరిశీలిస్తున్నారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చే పనిలో అధికారులు ఉండగా, మాక్‌డ్రిల్, బైండోవర్ కేసులు నమోదు వంటి అంశాలతో పోలీసులు తీరిక లేకుండా ఉన్నారు. ఆమదాలవలస నియోజకవర్గం నుంచి తొలి ఫలితం వెల్లడి కానుండగా, ఆఖరుగా పాతపట్నం నియోజకవర్గం నుంచి తెలియనుంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 18,92,457 మంది ఓటర్లు ఉన్నారు. ఈనెల 13న జరిగిన పోలింగ్‌లో 14,17,959 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ అనంతరం ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల, పాతపట్నం నియోజకవర్గాల ఇవిఎంలను ఎచ్చెర్లలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించి మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు కోసం అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్, ఇవిఎంల్లో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపునకు సిబ్బందిని ఖరారు చేశారు. మొత్తం 1300 మందిని కౌంటింగ్ కోసం వినియోగించనున్నారు. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఉంటాయి. ప్రతి టేబుల్‌కు సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. ఒక్కో రౌండ్‌లో 14 టేబుళ్లపై 14 ఇవిఎంల్లోని ఓట్లను లెక్కిస్తారు. ఒక్కో హాల్‌లో ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి 14, పక్కనే ఎంపీ నియోజకవర్గానికి 14 చొప్పున టేబుళ్లను ఏర్పాటు చేశారు.

తొలుత ఆమదాలవలస... చివరిలో పాతపట్నం ఫలితం

ప్రతి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి కౌంటింగ్ రౌండ్లు ఉంటాయి. కనిష్టంగా 19, గరిష్టంగా 24 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. ఆమదావలసలో 19 రౌండ్లలో లెక్కించనున్నారు. అక్కడ నుంచే తొలి ఫలితం వెలువడనుంది. మధ్యాహ్నం మూడు గంటల కల్లా తుది ఫలితం రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో 24 రౌండ్లలో ఫలితం వస్తుందని, సాయంత్రం ఐదు గంటలకు తుది ఫలితం వెలువడవచ్చని భావిస్తున్నారు. మిగిలిన నియోజకవర్గాలకు సంబంధించి ఇచ్ఛాపురం 22 రౌండ్లు, పలాస 21, శ్రీకాకుళం 20, ఎచ్చెర్ల 23, నరసన్నపేట 21 రౌండ్లలో కౌంటింగ్ చేపట్టనున్నారు. అంతా అనుకున్న ప్రకారం ఓట్ల లెక్కింపు జరిగితే ఒక్కో రౌండ్‌కు 30 నిమిషాల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. మొత్తం మీద సాయంత్రం ఐదు గంటల సమయానికి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

త్వరితగతిన పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం ఏర్పాట్లు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉదయం ఎనిమిది గంటలకు మొదలవుతుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, ఆ తర్వాత ఇవిఎంల ఓట్లను లెక్కించనున్నారు. జిల్లాలో 38,856 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఎక్కువ సమయం తీసుకోకపోయినా ఎంపీ నియోజవర్గానికి సంబంధించి అధిక సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో త్వరితగతిన పూర్తి చేసేలా అదనపు టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు.

ఫలితాలపైనే సర్వత్రా చర్చ

ఓట్ల లెక్కింపునకు సమయం దగ్గర పడుతుండడంతో, జిల్లాలో ఏ ఇద్దరిని కలిసినా ఫలితాల పైనే ప్రధానంగా చర్చించుకుంటున్నారు. ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారన్న దానిపై విశ్లేషణలు చేస్తున్నారు. జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయన్న దానితో పాటు రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి వస్తారనే విషయాలపైనా మాట్లాడుకుంటున్నారు. టీ, టిఫిన్ షాపుల నుంచి షాపింగ్‌మాల్స్ వరకు ఎక్కడ చూసినా ఫలితాల పైనే చర్చ నడుస్తోంది. ఎన్నికల ఫలితాలకు సంబంధించిన అనేక సర్వేలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఒక్కో సర్వే ఒక్కో మాదిరిగా ఉండడంతో ఏది నమ్మాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. మొత్తమ్మీద ఫలితాలు వచ్చే వరకు అభ్యర్థులు, నాయకులతో పాటు సాధారణ ప్రజలకు టెన్షన్ తగ్గేలా కనిపించడం లేదు.

అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

కౌంటింగ్ కేంద్రాల వద్ద ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, డిటిలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కౌంటింగ్ అంశాలపై దృష్టిసారించాలని, తప్పిదాలు జరగరాదని స్పష్టం చేశారు. ఆర్‌ఒ, ఎఆర్‌ఒ పక్కాగా కచ్చితత్వంతో ఉండాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లో టేబుల్స్, కంప్యూటర్లు, ఇంటర్నెట్, తదితర ఏర్పాట్లను ముందుగానే చూసుకోవాలని స్పష్టం చేశారు. అన్ని ఏర్పాట్లు 28వ తేదీ నాటికి పూర్తి చేసి 29వ తేదీన సర్టిఫికేట్ పొందాలన్నారు. ఇవిఎం సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు పోస్టల్ బ్యాలెట్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు 3వ తేదీన శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఉంటుందన్నారు. మాక్ డ్రిల్ సమయంలో ప్రతి అంశంపైనా దష్టి సారించాలన్నారు. ట్రైనింగ్ నోడల్ అధికారితో కో ఆర్డినేషన్ చేసుకోవాలన్నారు. సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. ఇవిఎంల తరలింపులో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. జెసి ఎం.నవీన్ మాట్లాడుతూ మెయిన్ గేటు ద్వారా పరిశీలకులు, ఆర్‌ఒలు వెనుక వైపు గేటు నుంచి అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్లకు ప్రవేశం ఉంటుందని తెలిపారు. పార్కింగ్ కూడా వెనుక గేటు వైపు వద్దే వేర్వేరుగా ఉంటుందని, అక్కడే వైద్య బృందాలు ఉంటాయని చెప్పారు.

ఎస్‌పి రాధికతో చర్చిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

లెక్కింపు కేంద్రాలకు సెల్‌ఫోన్లు వద్దు

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం / ఎచ్చెర్ల

ఓట్ల లెక్కింపు కేంద్రాలకు సెల్‌ఫోన్లకు అనుమతి లేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. ఎచ్చెర్ల శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో నియోజకవర్గాల వారీగా సోమవారం డ్రై రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సమయంలో ఎన్నికల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నియోజకవర్గాల వారీగా డ్రై రన్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు జాగ్రత్తలు పాటించాలన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు. లెక్కింపు సిబ్బంది, ఏజెంట్లు, అభ్యర్థుల ప్రవేశంపై ఎస్‌పి జి.ఆర్ రాధికతో చర్చించారు. డ్రై రన్‌లో ఆమదాలవలస రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎఎస్‌పి ప్రేమ్‌కాజల్, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సుదర్శన్ దొర, భరత్ నాయక్, అప్పారావు, సిహెచ్.రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహనరావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, నోడల్ అధికారులు, తహశీల్దార్లు, ఓట్ల లెక్కింపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

3 వరకు పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

మాట్లాడుతున్న నాగరాణి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియను జూన్ మూడో తేదీ వరకు నిర్వహించనున్నట్లు సాంకేతిక విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ నాగరాణి తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కరిక్యులం సిలబస్‌లో మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. పక్కాగా ప్రయోగాల నిర్వహణ ఉంటుందన్నారు. ఇంటర్న్‌షిప్‌నూ అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శ్రీకాకుళం మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్, టెక్కలి, ఆమదాలవలస, సీతంపేట పాలిటెక్నిక్ కళాశాలల్లో 780 సీట్లు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది 1,42,025 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు పరీక్షలు రాయగా 1,24,430 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ డైరెక్టర్ బి.జానకిరామయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఎ.వి రామకృష్ణ, జి.దామోదరరావు, టిపిఒ పి.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో గోరుముద్ద/పోషణ కార్యక్రమంపై మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. జిల్లా ప్రత్యేక శిక్షకులు యు.రాము గోరుముద్ద మెనూ తయారీ విధానంపై అవగాహన కల్పించారు. వంట నిర్వాహకులకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ తీరును వివరించారు. ప్రతి విద్యార్థి పాఠశాల మధ్యాహ్న భోజనం శత శాతం తినే విధంగా తయారు చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎంఇఒ కె.అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యార్థులకు భోజనం రుచిగా, శుచిగా అందించాలని సూచించారు. శిక్షణలో ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌ఎంటిలు, 69 పాఠశాలల నుంచి వంట నిర్వాహకులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ వెంకటేశ్వరరావు

ఇసి నిబంధనలు పాటించాలి

మాట్లాడుతున్న డిఎస్‌పి బాలచంద్రారెడ్డి

పోలాకి: గ్రామాల్లో ప్రతిఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి ప్రశాంతంగా ఉండేటట్లు చూడాలని టెక్కలి డిఎస్‌పి బాలచంద్రారెడ్డి సూచించారు. పోలాకి పోలీస్‌స్టేషన్‌లో అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని అన్నారు. అలాగే 144 సెక్షన్ కూడా అమలు ఉందని అన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగ్ రోజున, తరువాత ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పార్టీల నాయకులు సహకరించాలన్నారు. ఇప్పటికే కొందరిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఇంకా మీ దృష్టిలో ఎవరైనా ఉంటే మాకు సమాచారం ఇస్తే ముందే వారికి తెచ్చి కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ డిఎస్‌పి రాజా, నరసన్నపేట సిఐ బి.ప్రసాదరావు, పోలాకి ఎస్‌ఐ వి.సత్యనారాయణ, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైస్ ఎంపిపిలు కోట అప్పారావు, కె.తాతారావు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఎం.వెంకట అప్పలనాయుడు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - పలాస

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీస్ సిబ్బంది ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో సమస్యాత్మక గ్రామమైన చిన్నబడాంను సోమవారం సాయంత్రం సందర్శించారు. ఈ గ్రామంలో పోలింగ్ రోజు చిన్నపాటి ఘర్షణలు చెలరేగి కొట్లాటకు దారి తీసిన విషయం పాఠకులకు విధితమే. స్థానిక వైసిపి నాయకులు బూత్ ఏజెంటుపై దాడికి దిగడంతో పాటు ఓటింగ్‌లో పాల్గొన్నాడని, వలస ఓటరు ఇంటికి తాళం వేసి నిర్బంధించిన సంఘటన జరగడంతో పోలీసు అధికారులు ఈ వ్యవహారంపై సీరియస్‌గా తీసుకున్నారు. అనంతర పరిణామాల వల్ల గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తడంతో పోలీసు నిఘా కొనసాగుతోంది. వచ్చే నెల 4న ఎన్నికల ఫలితాలు రానుండడంతో గ్రామాల్లో ఘర్షణలు చెలరేగకుండా ఉండేందుకు పోలీసులు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఎస్‌పి గ్రామాన్ని సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ సిబ్బంది పలు సూచనలు చేశారు. పోలీసు పికెట్ ఏర్పాటు చేయాలని, రౌడీషీటర్లపై నిఘా పెట్టాలని, అనుమానిత వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, బైండోవర్లో ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఆమె వెంట కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి, సిఐ విజయానంద్, ఎస్‌ఐ పారినాయుడు, సిబ్బంది ఉన్నారు.

పలాస : పరిశీలిస్తున్న ఎస్‌పి జి.ఆర్ రాధిక

ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్ పరిశీలన

ఎచ్చెర్ల సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్, అనంతరం ఘర్షణలు, అల్లర్లు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదేశించారు. ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌ను సోమవారం పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై దృష్టిసారించి త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి కేసులు పరిష్కరించాలన్నారు. పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు కోర్టు ఆదేశాల మేరకు రిలీజ్, డిస్పోజ్ చేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపు, ఫలితాల దృష్ట్యా గ్రామాల్లో ట్రబుల్ మాంగర్స్‌ను ముందస్తుగా గుర్తించి బైండోవర్ చేయాలని, నోటీసులు ఇవ్వాలన్నారు. గ్రామస్థాయిలో ప్రజలతో సభలు నిర్వహించి ఎన్నికల ఫలితాల అనంతరం ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ రమణ

తడి, పొడి చెత్త నుంచి సంపద సృష్టి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

పంచాయతీ పరిధిలో నిర్మించిన చెత్త సంపద కేంద్రాల ద్వారా తడి, పొడి చెత్తతో సంపద సృష్టించవచ్చని టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి.రమణ అన్నారు. మండలంలోని పాతటెక్కలిలో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు ఎరువును తయారు చేయవచ్చు అన్నారు. వ్యవసాయంలో కూరగాయలు, పళ్ల తోటలు పెంపకంలో ఈ ఎరువు ఉపయోగపడుతుందన్నారు. చెత్త సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు అవగాహన కలిగించారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆయా పంచాయతీ కార్యదర్శులదే అన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లో చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు కార్యదర్శి సిహెచ్.మధుబాబు, విఆర్‌ఒ గాలి రవి ఉన్నారు.

చిన్నారిపై లైంగిక దాడి?

ప్రజాశక్తి - పొందూరు

అభం శుభం తెలియని ఐదేళ్ల చిన్నారిపై వరుసకు చిన్నాన్న అయ్యే 24 ఏళ్ల యువకుడు మామిడిపండు ఆశ చూపి లైంగిక దాడికి ప్రయత్నించినట్లు తెలిసింది. ఈ అమానుష ఘటన మండలంలోని మలకాంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామ పెద్దలు, యువకుని కుటుంబసభ్యులు బాధిత కుటుంబంపై ఒత్తిడి తీసుకొచ్చి రాజీ చేయించినట్లు సమాచారం. ఈ ఘటనపై ఆగ్రహంతో రగిలిపోతున్న స్థానిక యువకులు విషయాన్ని మీడియా దృష్టికి తీసుకొచ్చారు. వివరాల్లోకి వెళ్తే... మలకాంకు చెందిన మహిళకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త చనిపోవడంతో కూలి పని చేసుకుని పిల్లలను పోషించుకుంటోంది. ఆదివారం రాత్రి చిన్నారి ఇంటి వద్ద ఆడుకుంటుండగా, వరుసకు చిన్నాన్న అయిన అదే గ్రామానికి చెందిన యువకుడు మామిడిపండు ఇస్తానని చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు సమాచారం. ఏడుస్తూ ఇంటికి చిన్నారి రాగా, ఎందుకు ఏడుస్తున్నావని తల్లి అడగడంతో తెలిసిన మేరకు తల్లికి చెప్పింది. చిన్నారిని పరిశీలించిన తల్లి జరిగిన సంఘటన వాస్తవమని గ్రహించి కుటుంబసభ్యులతో పాటు గ్రామంలోని బంధువులకు చెప్పడంతో, యువకునికి దేహశుద్ధి చేశారు. పోలీసుల వరకు వెళ్తే కేసుల్లో చిక్కుకోక తప్పదని యువకుని కుటుంబ సభ్యులు చిన్నారి కుటుంబ సభ్యులపై బంధువులతో ఒత్తిడి తీసుకొచ్చి రాజీ కుదిర్చారు. ఈ ఘటనపై ఆగ్రహంతో ఉన్న గ్రామ యువత దుర్మార్గానికి పాల్పడిన వ్యక్తికి శిక్ష పడాలనే ఉద్దేశంతో మీడియాకు విషయాన్ని తెలియజేశారు. విలేకరులు గ్రామానికి వెళ్లి సంఘటనపై ఆరా తీయగా, జరిగిన ఘటన వాస్తవమే కానీ తాము చెప్పినట్లు రాయొద్దని తెలిపారు. మరోవైపు దుర్మార్గానికి పాల్పడిన యువకుడిని కుటుంబసభ్యులు గ్రామం నుంచి వేరే ప్రాంతానికి పంపించేశారు. ఈ ఘటనపై విలేకరులు ఎస్‌ఐ రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా, తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. దీనిపై విచారణ చేసి ఘటన వాస్తవమైతే నిందితునిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆదర్శప్రాయుడు నెహ్రూ

డిసిసి అధ్యక్షులు పరమేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్వతంత్ర భారతదేశంలో సామ్యవాదానికి కృషి చేసిన మహనీయుడు మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ అని, వ్యవసాయ, పారిశ్రామిక ప్రగతికి ఆయన ఎంతగానో కృషి చేశారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సోమవారం నిర్వహించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు స్వాతంత్ర ఫలాలు అందించేందుకు నెహ్రూ కృషి చేశారని అన్నారు. ప్రజలను ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి కార్పొరేట్, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు చేశారని అన్నారు. స్వతంత్ర అనంతరం దేశ తొలి ప్రధానమంత్రిగా రాజ్యాంగ బద్ధమైన పాలన సాగించారని పేర్కొన్నారు. నెహ్రూ కన్న కలలను నిజం చేసేందుకు ప్రస్తుతం రాహుల్‌గాంధీ పాటుపడుతున్నారని అన్నారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చిందని విమర్శించారు. ప్రధాని మోడీ పాలన దేశ సమగ్రతకు ముప్పు తెచ్చేదిగా మారిందన్నారు. బిజెపి ప్రభుత్వ విధ్వంసకర పాలన, ప్రత్యర్థులను వేధించడం, పెద్దఎత్తున అవినీతి, ప్రభుత్వరంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ... కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు కపాడే రీతిలో ఉన్నాయన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి దేశ సమగ్రతను కాపాడుకోవల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణ, నరసన్నపేట అభ్యర్థి మంత్రి నరసింహమూర్తి, ఇచ్ఛాపురం అభ్యర్థి మాసుపత్రి చక్రవర్తిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గోవింద మల్లిబాబు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, సీనియర్ నాయకులు దంత త్రినాథరావు, అంబటి దాలినాయుడు, కె.వెంకటరావు, జి.ప్రసాద్ పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

వేసవి వినోదంతో చిన్నారుల మెదడుకు పదును

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వేసవి సెలవుల్లో చిన్నారులు సెల్‌ఫోన్‌కు, టివిలకు అతుక్కుని వ్యక్తిత్వ వికాసానికి, శారీరక శ్రమకు దూరమవుతున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో వారి మెదడు మొద్దుబారి విషయ పరిజ్ఞానం తగ్గుతుందని మన్యం జిల్లా విశ్రాంత డిఎంహెచ్‌ఒ డాక్టర్ బగాది జగన్నాథరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో చిల్డ్రన్స్ క్రియేటివ్ క్లబ్ ఆధ్వర్యాన వేసవిలో వినోదాన్ని అందించేందుకు చేపడుతున్న వివిధ కార్యక్రమాలు ఆలోచనాశక్తి, పఠనాశక్తిని పెంచేవిగా ఉన్నాయన్నారు. నగరంలోని తిలక్ నగర్‌లో ఉన్న యుటిఎఫ్ కార్యాలయంలో చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యాన వేసవి వినోద కార్యక్రమం నిర్వహించారు. దీనిని చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బగాది శ్రావ్యతో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. డాక్టర్ శ్రావ్య చిన్నపిల్లల్లో పృజనాత్మకతను పెంపొందించడానికి చేపట్టాల్సిన వ్యాయామం, ఆలోచనా శక్తిని పెంచుకునేందుకు తీసుకోవాల్సిన మెళుకువలు వివరించారు. పిల్లలతో కలిసి పలు క్రియలు నిర్వహించారు. శిబిరంలో క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో వేగంతో పాటు పరుగులు తీస్తూ పిల్లల గురించి పట్టించుకునే తీరిక కల్పించుకోలేకపోతున్నారని చెప్పారు. గతంలో పిల్లలు భోజనం చేయమని మారాం చేస్తే ఆరుబయట చంద్రుడిని, జంతువులను, పశువులను చూపించి వాటి గుణగణాలను వివరించేవారని గుర్తు చేశారు. కానీ, ప్రస్తుతం పిల్లలు చేతికి సెల్‌ఫోన్ ఇచ్చి తమపనుల్లో నిమగ్నమవుతున్నారని పేర్కొన్నారు. వారిలోని సృజనాత్మకతను వెలికి తీయాల్సిన తరుణంలో సెల్‌ఫోన్‌కు పరిమితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో క్లబ్ ఆధ్వర్యాన ఏటా వేసవి సెలవుల్లో వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిన్నారులతో పలు క్రియలను చేయిస్తున్న డాక్టర్ శ్రావ్య

చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

చెక్కులు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నౌపడ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హెచ్‌సి కె.ప్రసాద్ కుటుంబసభ్యులకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీస్‌శాఖ ద్వారా వచ్చిన రూ.75 వేలు చెక్కులను మృతిచెందిన హెచ్‌సి ప్రసాద్ భార్య నీలిమ దేవి, కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ తమ శాఖ పరంగా ఏ అవసరం వచ్చినా నేరుగా సంప్రదించాలని, శాఖా పరంగా రావాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు చేపడతామని, కుటుంబ సభ్యులకు పోలీస్‌శాఖ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి జి.ప్రేమ కాజల్, పరిపాలనాధికారి గోపినాధ్ ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జీడి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- పలాస

జీడి రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకుని మార్కెట్ మాయాజాలం నుంచి రైతాంగాన్ని కాపాడాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్యాలయం వద్ద ధర్నా సోమవారం నిర్వహించి ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్‌లో జీడి ధర ఎంతుందో రైతులకు తెలియకుండా ఎందుకు గోప్యత పాటించారని ప్రశ్నించారు. రూ.16 వేలు మద్దతు ధర కల్పించాలని కొంతకాలంగా ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. జీడి రైతులకు ఇచ్చిన పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి వంకల పాపయ్య మాట్లాడుతూ పలాసలో జీడి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రైతాంగం చేస్తున్న న్యాయమైన పోరాటాన్ని బలపరచాలని భారత్ కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి డిమాండ్ చేశారు. ధర్నాలో పిడిఎస్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్, చంద్రయ్య, కోదండరావు, మాధవరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న వేణుగోపాల్

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పలాస

ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న, ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తిస్థాయిలో విత్తనాలు, పంట రుణాలు అందించలేదని రైతు సంఘం నాయకులు చాపర వేణుగోపాల్ అన్నారు. ఈ మేరకు తహశీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడును సోమవారం కలిసి రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతాంగానికి అవసరమైన అన్నిరకాల విత్తనాలు 90 శాతం సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. గత ఖరీఫ్, రబీ సీజన్లలో పంట నష్టపోయిన రైతాంగానికి పంట బీమా సొమ్ము ఇంతవరకు ప్రభుత్వం చెల్లించలేదని అన్నారు. పూర్తిస్థాయిలో పంటల బీమా సొమ్ము రైతాంగానికి తక్షణం అందించాలని కోరారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రైతులు కౌలు రైతులకు రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. వంకల ముకుంద, హనుమంతు రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భైరాగినాయుడు

కాలువ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి- పోలాకి

ఖరీఫ్ సీజన్ వచ్చేసిందని, అందుకు ఉపాధి హామీ ద్వారా కాలువుల పనులు చేపట్టాలని, అలాగే కొలతలు ప్రకారం పనులు కల్పించాలని ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ముద్దాడ దమయంతి అధ్యక్షతన సోమవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా గత మూడు నెలల పనులపై సమీక్షించారు. వ్యవసాయ రంగం, ఉపాధి హామీ, వెలుగు, ఐసిడిఎస్, విద్య, వైద్యం, విద్యుత్, పిఆర్ తదితర శాఖల అధికారులు తాము చేసే పనులపై వివరణ ఇచ్చారు. వైస్ ఎంపిపిలు కోట అప్పారావు, కె.తాతారావు, ఎంపిడిఒ ఉషశ్రీ, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నేత్రాలను పరీక్షిస్తున్న వైద్యాధికారి అంజలి

62 మందికి నేత్ర వైద్య పరీక్షలు

పాతపట్నం: మండలంలోని తెంబూరులో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యాన జాతీయ అంధత్వ నివారణ సంస్థ అధ్యక్షతన శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ డాక్టర్ అంజలి 62 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 28 మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వారిని మంగళవారం ఉదయం శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేస్తామని డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రామారావు, వటవృక్ష ఇన్‌ఛార్జి బోయిన చంద్రమౌళి, కన్వీనర్ అంధవరపు కామేశ్వరరావు, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షిక మహోత్సవం

శ్రీకాకుళం అర్బన్: నగరంలో సీపన్నాయుడుపేటలో కొలువై ఉన్న శ్రీ చెవిటి అమ్మవారి ఆలయ వార్షిక మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఆలయ సాంప్రదాయ బద్ధంగా సాగిన ఈ వేడుకల్లో మహిళలు పాల్గొని విశేష కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ ఉచితంగా అన్న ప్రసాదాన్ని అందించారు.

ప్రమాదం అంచున ప్రయాణం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సరుబుజ్జిలి మండలంలోని అలికాం - బత్తిలి ప్రధాన రహదారిలో వాహనదారులు ప్రమాదం అంచున ప్రయాణాలు సాగిస్తున్నారు. ఐదేళ్లుగా ఈ రహదారిలో ఏర్పడిన గుంతల మాట ఎలా ఉన్నప్పటికీ కల్వర్టుల వద్ద ఉన్న రక్షణ గోడలు కూలి ఆ ప్రాంతంలో ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నప్పటికీ రోడ్లు భవనాల శాఖ స్పందించకపోవడం పట్ల వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆమదాలవలస నుంచి సరుబుజ్జిలి, ఎల్ఎన్ పేట, హిరమండలం, కొత్తూరు, బత్తిలి, పాతపట్నం, ఒడిస్సా రాష్ట్రాలకు ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనాలు ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టులు శిథిలావస్థకు చేరుకొని ఇటీవల షలంత్రి

షలంత్రి వద్ద కూలిన కల్వర్టు ప్రదేశం (ఫైల్)

బొప్పడాం వద్ద శిథిలమైన కల్వర్టు

గ్రామ సమీపంలో ఉన్న ఒక కల్వర్టు ఆకస్మాత్తుగా కుంగిపోవడం జరిగింది. వాహనాలను దారి మళ్లించి సంబంధిత అధికారులు కల్వర్టు నిర్మాణాన్ని పూర్తిగా తొలగించి తాత్కాలిక పైపులు ఏర్పాటు చేసి యధావిధిగా రహదారి రాక పోకలకు సిద్ధం చేశారు. ఇదే రహదా రిలో పలు ప్రాంతాల్లో ఉన్న కల్వర్టులు కూలిపోవడానికి సిద్ధంగా ఉండటంతో పాటు కల్వర్టులకు ఇరువైపుల ఏర్పాటు చేసిన రక్షణ గోడలు కూలిపోయి వాహన దారులు ఆ ప్రాంతానికి వచ్చేసరికి బిక్కు బిక్కుమంటూ ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

వినతిపత్రాన్ని అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులుగా గత 20 ఏళ్లగా పనిచేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు సోమవారం పంచాయతీ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. నిరంతరం నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతుండడంతో చాలీచాలని జీతాలతో తమ జీవితం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కనీస వేతనం రూ.18వేలు పెంచాలని, ఇఎస్‌ఐ అమలు చేయాలని, గుర్తింపు కార్డులను జారీ చేయాలని కోరుతూ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

శతశాతం రీ పేమెంట్ సాధించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యుల జీవనోపాధులను మెరుగుపర్చుకొని, కుటుంబ ఆదాయాన్ని పెంపొందించే లక్ష్యంతో గ్రామ సంఘం ద్వారా ఇచ్చిన అన్నిరకాల అప్పులపై శతశాతం రీపేమెంట్ సాధించాలని, వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. సోమవారం పట్టణంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిబ్బంది శిక్షణ, సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంఘంలోని సభ్యులు తీసుకున్న రుణాన్ని గడువు దాటకుండా, బకాయి లేకుండా సకాలంలో చెల్లించిన వారందరికీ వారి అవసరం మేరకు మళ్లీ శ్రీనిధి బ్యాంకు నుంచి వెంటనే రుణాన్ని మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు, శ్రీనిధి మేనేజర్ ఉదయ్‌తో పాటు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, గ్రామ సంఘం విఏఎలు, అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్ పాల్గొన్నారు.

మార్నింగ్ రాగా నిర్వహిస్తున్న జెసిఐ ప్రతినిధులు

అవుట్ బౌండ్ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మండలం కళ్లేపల్లి సముద్ర తీరాన శ్రీకాకుళం సన్ రైజర్స్ నేతృత్వాన అవుట్ బౌండ్ శిక్షణ తరగతులను నిర్వహించారు. సన్ రైజర్స్ సెక్రటరీ సింగూరు ప్రవీణ్ కుమార్, జోన్ శిక్షకులు దూసి సంతోష్‌లు హాజరై మార్నింగ్ రాగా ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి వ్యక్తిలోనూ అంతర్గతంగా దాగి ఉన్న నాయకత్వ లక్షణాలు పెంపొందించు కోవడానికి, అలానే గ్రూప్‌ను సమర్ధతతో ముందుకు నడిపించడంలోను అవగహన పెంచుకు నేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ హర్షవల్లి, అనిత, కిరణ్, సుధాకర్, సభ్యులు వెంకటేష్, సుదర్శన్, దామోదర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సహజవనరుల పరిరక్షణకు పోరాటం



పలాస: జిల్లాలో గిరిజనులు చేపట్టిన పోరాటాల కొనసాగింపే ప్రస్తుత దండకారణ్యంలో జరుగుతున్న ఆదివాసీల పోరాటాలని విరసం అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణారావు అన్నారు. మండలంలోని బొడ్డపాడులోని అమరవీరుల స్మారక మందిరం వద్ద నాటి పోరాట యోధుడు పంచాది కృష్ణమూర్తి తదితరులు అమరత్వం పొందిన మే 27 దినాన్ని పురస్కరించుకొని అమరుల బంధుమిత్రుల సంఘం ఆధ్వర్యాన సోమవారం అమరవీరుల స్మారక సభను నిర్వహించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంజమ్మ అధ్యక్షతన సభ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దండ కారణ్యంలో గిరిజనులు పెద్ద ఎత్తున సహజవనరుల పరిరక్షణ కోసం పోరాటాలు చేస్తున్నారని అన్నారు. అయితే పాలకవర్గాలు ఆ సంపదను కాజేయడానికి, కార్పొరేటు శక్తులకు కట్టబెట్టడానికి గిరిజనులపై యుద్ధం ప్రకటించిం దన్నారు. ముందుగా అమరవీరుడు ఆజాద్ తండ్రి లక్ష్మణరావు వేదిక ముందు అరుణ పతాకాన్ని ఎగురు వేశారు. పిడిఎం నాయకుడు వై.కోటేశ్వరరావు, డిటిఎఫ్ నాయకుడు కోత ధర్మారావు పాల్గొన్నారు. అలాగే సూదికొండలో నిర్వహించిన కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, అరుణ పథకాన్ని అరుణోదయ సంస్కృతిక సమైక్య జిల్లా అధ్యక్షులు సొర. రామారావు, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు బతకల ఈశ్వరమ్మ, కార్మిక సంఘం నాయకులు షణ్ముఖరావు, సాగర్, సరస్వతి, కోదండరావు పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నప్పటికీ ఇప్పటివరకు జిల్లా రైతాంగానికి విత్తనాలు సరఫరాలో జాప్యం జరుగుతుందని, 90 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలను ప్రభుత్వం అందించాలని ఎపి రైతు సంఘం, (సిపిఐ) ఇతర ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం రైతు, ప్రజా సంఘాల నాయకులు చిక్కాల గోవిందరావు, మొజ్జాడ యుగంధర్, కొన్న శ్రీనివాసరావు, టి. తిరుపతిరావు, పిరియ అప్పారావులతో కూడిన బృందం తహశీల్దార్ కార్యాలయ ంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌లో కూడా జిల్లాలోని శివారు భూములకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రబీ సీజన్‌లో నీరు కూడా అందివ్వలేని పరిస్థితిలో జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులున్నాయని, కాలువల్లో పూడికలు తీసి, మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందించేలా అధికారులు పనులు చేపట్టాలని

వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ, రైతుసంఘం నాయకులు

కోరారు. రైతులకు వ్యవసాయ రంగంలో మంచి దిగుబడి వచ్చేలా వారికి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని, వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గతేడాది ఖరీఫ్‌లో సకాలంలో ఎరువులు అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందని అలాంటి పరిస్థితులు ఈ ఏడాది రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. కౌలు రైతులకు కూడా రుణాలు అందించాలని కోరారు.

నౌపడ : విద్యార్థులకు గణితంపై వివరిస్తున్న రామకృష్ణ

గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి- లావేరు

ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు గణితంలో మెలకువలు నేర్చుకోవాలని రిసోర్స్ పర్సన్ ఎమ్.శంకరరావు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో గణితంపై విద్యార్థులకు బోధించారు. ప్రాచీన సంఖ్యానామాలు, వర్గమూలాలు, కూడికలు, తీసివేతలు, త్రిభుజములు, కొలతలు, కాలమానం, గణిత శాస్త్రవేత్తల జీవితాలను తెలిపారు. అలాగే లెక్కలు వాటి జిమ్మిక్కులు ఎలా చేయాలో చెప్పారు. లెక్కలు అంటే భయపడకూడదని చిన్నతనం నుంచే నేర్చినట్లయితే లెక్కలు ఈజీగా చేయవచ్చునన్నారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు, సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాలి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిఖరాలు గ్రంథాలయాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా హాజరైన విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్, గణితం సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. వేసవి సెలవులను ఉపయోగించుకొని విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

ఆమదాలవలస : సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలతో పోలీసులు

విస్తృతంగా పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సరుబుజ్జిలి మండలంలో ఎస్ఐ బి.నిహార్ ఆధ్వర్యంలో గ్రామాల్లో విస్తృతంగా పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. సోమవారం మండలంలోని చిగురువలసలో వేకువజామున కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని 19 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్ఐ నిహార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడే రోజున ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక నిబంధనలు ఆమలులో ఉన్నాయని, ప్రతిఒక్కరూ పోలీస్ నిబంధనలు పాటించి శాంతి భద్రతులకు భంగం కలగకుండా నడుచుకొని పోలీసులకు సహకరించాలని కోరారు. వివాదాల్లో తలదూర్చి విలువైన కాలాన్ని, జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ప్రజలు, యువకులకు సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐలు చంద్రినాయుడు, ఆనంద రెడ్డి, హెచ్‌సి రవిశంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: మండలంలోని రావివలసలో సోమవారం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. టెక్కలి ఎస్ఐ లక్ష్మి ఆధ్వర్యాన సిబ్బంది రావివలస, పాతకాలనీ తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈమెతో పాటు ఎఎస్ఐ వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ సిబ్బంది

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని అక్కుపల్లి అంగన్వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ లత అన్నారు. మండలంలోని మర్రిపాడులో ప్రపంచ పరిశుభ్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 29 వరకు కిశోర్ బాలికల రుతుక్రమం, ఆరోగ్యం, పరిశుభ్రతపైన అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. బాల్యవివాహాలు వల్ల కలిగే అనర్థాలను పిల్లలతో పాటు తల్లితండ్రులకు వివరించారు. కిశోర బాలికలు రుతుక్రమం సమయంలో పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. పౌష్టిక ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే అంగన్వాడీ కార్యకర్తల సహకారం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మర్రిపాడు, రాజాం, తర్లాగాడూరు, పల్లిసారథి అంగన్వాడీ కార్యకర్తలు పార్వతి, గిరిజా, హైమ, సరస్వతి, జమున, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని మండపల్లి పంచాయతీలో కిశోర బాలికలు ఆరోగ్యం, పరిశుభ్రతపై అంగన్వాడీ కార్యకర్తలు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు బి.నరసమ్మ, కె.జ్యోతి, కె.సునీత, జి.జ్యోతి, లలిత, ఎం.జ్యోతి, ఎఎన్ఎం ఉషారాణి, ఆశావర్కర్లు పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

నది శుభ్రతకు ఎంహెచ్ఒ తోడ్పాటు

శ్రీకాకుళం అర్బన్: నగరం నడిబొడ్డున ప్రవహిస్తున్న నాగావళి నది పరిశుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకుని శుభ్ర పరుస్తున్న మున్సిపల్ కార్పోరేషన్ హెల్త్ ఆఫీసర్ వెంకటరావును పలువురు ఈవెంట్ ఆర్గనైజర్లు అభినందించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ క్లీన్ శ్రీకాకుళం - గ్రీన్ శ్రీకాకుళం అనే నినాదంతో నాగావళి నదిలో రివర్ క్లీన్ ఈవెంట్‌కు కృషి చేస్తున్న బృందాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈవెంట్ ఆర్గనైజర్లు జీవన్, హరీష్, ప్రశాంత్, మధు, సాయి ప్రణీత్ పాల్గొన్నారు.

ఎంహెచ్‌ఒను అభినందిస్తున్న ఆర్గనైజర్లు

లండన్ మ్యాగజైన్‌లో కవితకు స్థానం

ఆమదాలవలస: లండన్‌కు చెందిన తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ (తాల్) ఉగాది సందర్భంగా విడుదల చేసిన 'మా తెలుగు -2024' వార్షిక సంచికలో పట్టణానికి చెందిన కవి కుప్పిలి వెంకట రాజారావు రచించిన 'తనివితీరని తావి-తెలుగు' అనే కవితకు స్థానం లభించింది. ఈ మేరకు లండన్ మేగజైన్ సంపాదకులు నెల్లుట్ల సునీత మెయిల్ ద్వారా రాజారావుకు సమాచారం పంపినట్లు తెలిపారు. భారతరత్న పి.వి.నరసింహారావు ముఖ చిత్రంతో విడుదలైన ఈ సంచికను ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ ఆవిష్కరించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన కవితల్లో రాజారావు కవితకు స్థానం లభించడం విశేషం.

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: సమస్యల పరిష్కారమే లక్ష్యం కవిటిలో చేపడుతున్న బెంతు ఒరియాలు రిలే నిరాహారదీక్ష ఆదివారానికి 152వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ దశాబ్దాలుగా పరిష్కారం కానీ బెంతు ఒరియాల సమస్యకు రాజకీయ పార్టీల అలసత్వమే ప్రధాన కారణమని ఆరోపించారు. ముఖ్యంగా తరగతి ధ్రువపత్రాలు పత్రాలు లేకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగుల బంగారం లాంటి భవిష్యత్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తమకు తరగతి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్య


బాబూరావు

పలాస: మండలంలోని మొగిలిపాడుకు చెందిన గణే బాబురావు (46) జీడీ కార్మికుడు ఉరి వేసుకుని సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు నెమలికొండ సమీప ప్రాంతంలో ఉన్న జీడి చెట్టుకు ఉరి వేసుకుని ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు.


కాలిపోతున్న పూరిల్లు (ఇన్‌సెట్‌లో కాలిపోయిన పుస్తెలతాడు)

పూరిల్లు దగ్ధం

బూర్జ: మండలం లక్కుపురం గ్రామంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రేగాన ఆనందరావు పూరిల్లు పూర్తిగా కాలి బూడిదైంది. పాలకొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో బంగారంతో పాటు నగదు, బట్టలు, వంటసామాగ్రి, ఫర్నీచర్ కాలి బూడి దయ్యాయని బాధితులు వాపోయారు. బాధిత కుటుంబాన్ని ఎంపిపి కె.దీప సోమవారం పరామర్శిం చారు. అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఆనందరావు కుటుంబానికి అన్నంపేట గ్రామానికి చెందిన శ్రీ కాశీ విశ్వేశ్వర భజన బృందం తరపున రూ.6 వేలుతో పాటు దుస్తులు, బియ్యం తమవంతు సాయంగా అందించారు. అలాగే ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు రూ.10వేలు చెక్కును బాధితులకు అందజేశారు.

పరామర్శిస్తున్న గౌతు శివాజీ

టిడిపి కార్యకర్తపై దాడి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ పల్లివీధి చాకలి చెరువు ప్రాంతంలో నివాసం ఉంటున్న టిడిపి కార్యకర్త మర్రి భరత్‌పై 12 వార్డు కౌన్సిలర్ ప్రతినిధి, వైసిపి నాయకులు పోతనపల్లి హరితో పాటు ఆయన అనుచరులు ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో దాడి చేశారు. బాధితుడు కథనం మేరకు... మూడు రోజులుగా వైసిపి నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, ఎన్నికల సమయంలో టిడిపికు అనుకూలంగా పనిచేయడంతో ఆదివారం రాత్రి ఇంట్లోని భరత్‌ను బయటకు రప్పించారు. హరితో పాటు అంపోలు శ్రీకాంత్, బాబాజీ శ్రీను, కంచుమోజు కిరణ్, కోరాడ సాంబ, పోతనపల్లి మురళి కర్రలతో తీవ్రంగా దాడి చేశారు. దీంతో ఇంటిలో ఉన్న కుటుంబ సభ్యులు వార్డులో ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలకు సమాచారం అందించడంతో బాధితుడుకు చికిత్స నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శివాజీ సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భరత్‌ను పరామర్శించారు. అనంతరం శివాజీ మాట్లాడుతూ భారత్‌పై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, కృష్ణారావు, టంకాల రవిశంకర్ గుప్తా, మన్యయాల శ్రీనివాసరావు, మల్లా శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ కొవ్వూరు సురేష్‌కుమార్, సప్ప నవీన్ ఉన్నారు.

చిత్రపటాలకు నివాళ్లర్పిస్తున్న నాయకులు

దేశ సేవకులను స్మరించుకోవాలి

రణస్థలం: దేశ సేవకులను స్మరించుకోవాలని రణస్థలం జెడ్‌పిటిసి టొంపల సీతారాం, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ అన్నారు. భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, స్త్రీ విద్య కోసం ఉద్యమించిన వైతాళికుడు కందుకూరి వీరేశలింగం వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి, వైస్ ఎంపిపి భుజంగరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

మహిళకు ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే తమ సంస్థ లక్ష్యమని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు తామాడ లక్ష్మణరావు అన్నారు. మండల ంలోని దేవునల్తాడకు చెందిన తెరిపిల్లి శాంతమ్మ రెక్క ఆడితే గాని డొక్కాడని బతుకు. రోజు గడవడమే కష్టంగా ఉంది. అందులోనూ అనారోగ్యం బారినపడి మంచం పట్టింది. ఆమెకు బంధుమిత్రులు ఎవరూ లేక పోవడంతో అవస్థలు పడుతుంది. ఈమె దుస్థితిని చూసి ఎదురింటి ఆవిడ భోజన వసతి కల్పిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న సొసైటీ సభ్యులు సోమవారం దేవునల్తాడలో బాధితరాలు స్వగృహం వద్ద ఆమెకు రూ.పది వేలు నగదు అందించారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు చింత మోహన రావు, దానేష్, శ్రీను పాపారావు, మండల మహేష్, ఈశ్వరరావు, నీలయ్య, గనగళ్ల ఉమ, కొంకి మోహిని, సుంకర రాణి పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

బూర్జ: 108 వాహనాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా మేనేజర్ హరి ప్రసాద్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో 108 వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇఎంటి, ఫైలెట్‌ల వర్క్ పర్ఫామెన్స్, మెడికల్ ఎపిక్‌మెంట్ వర్కింగ్ కండిషన్, వాహనంలో లభించే మందులను తనిఖీ చేశారు. నిర్వాహణలో అశ్రద్ధ చూపవద్దని సూచించారు. ఆయనతో పాటు ఇఎంటి ఎ.రమణ, ఫైలెట్ సిహెచ్ మల్లేశ్వరరావు ఉన్నారు.